నిర్భయంగా ఓటు వేయండి : కలెక్టర్

చిట్వేలి, ఏప్రిల్ 10: ప్రజలు నిర్భయంగా ఓటు వేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకున్నామని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని సి.కందులవారిపల్లె పంచాయతీ మిట్టపల్లె హరిజనవాడలో ఓటర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పకడ్బందీగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగానే జిల్లాలో కొన్ని పోలింగ్‌స్టేషన్‌లు గుర్తించి పరిశీలనకు వచ్చామన్నారు. ఒకటి రెండు గ్రామాల ప్రజలు తాము ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారని, అలాగే జిల్లాలో కొన్ని గ్రామాల్లో సెపరేట్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారని వాటిని పరిశీలించి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ పోలింగ్ కేంద్రాలకు సరిపడా ఓట్లు లేని కారణంగా కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశామని, కనీసం 1500 ఓట్లు దాటి ఉంటేనే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం తరపున పకడ్బందీగా అన్ని ఏర్పాట్లు చేశామని, జిల్లా మొత్తానికి 1607 పోలింగ్ కేంద్రాలలో 12 వేల మందితో పకడ్బందీగా పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. పోలింగ్‌ను ఒక పండుగలా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించుకుందామన్నారు. నిర్భయంగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసి ప్రజాస్వామ్య సౌధాన్ని నిర్మించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం గ్రామస్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అలాగే సి.కందులవారిపల్లె పోలింగ్ కేంద్రాన్ని సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్పీ కృష్ణారావు, డీఎస్పీ చైతన్య, ఆర్డీవో మోహన్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి లీలావాణి, తహసీల్దారు జ్ఞానేశ్వరి, ఎంపీడీవో రంగారావు, సీఐ సురేంద్రనాథరెడ్డి, ఎస్ఐ సుధాకర్, రెవెన్యూ, మండల సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో కవాతు



రాజంపేటలో కేంద్ర బలగాలతో కవాతు చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

రాజంపేటటౌన్, ఏప్రిల్ 10: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేశామని, ప్రజలకు భరోసా కల్పించాలన్న ఉద్దేశ్యంతో బుధవారం కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, ఎస్పీ కృష్ణారావు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. కలెక్టర్, ఎస్పీ ముందు నడవగా పోలీసు బలగాలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీలు మాట్లాడుతూ మే 13వ తేదీ జరిగే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాజ్యాంగబద్ధంగా నిర్వహించడానికి ఓటుహక్కును ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వేయడానికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా రాజంపేట అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూంలను, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో మోహన్‌కుమార్, డీఎస్పీ చైతన్య, కోడూరు రిటర్నింగ్ అధికారి లీలావతి తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలు కాపాడాలని రాజస్థాన్ యువకుడి దేశ యాత్ర



ఓబులవారిపల్లె, ఏప్రిల్ 10: భారత దేశ సంస్కృతీ, సంప్రదాయాలు కాపాడాలని రాజస్థాన్‌కు చెందిన హర్ష పండిట్ హర్యానా (24) అనే యువకుడు దేశ యాత్ర చేస్తున్నాడు. యాత్రలో భాగంగా బుధవారం ఓబులవారిపల్లెకు వచ్చాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సంస్కృతీ, సంప్రదాయాలు కాపాడాలని తాను వెయ్యి రోజుల యాత్ర చేపట్టినట్లు తెలిపారు. తన కుటుంబం దేశ భద్రత కోసం పనిచేశారని, తాను కూడా దేశభక్తితో మన దేశ సంస్కృతీ, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించేందుకు ఎటువంటి డబ్బులు లేకుండా కనిపించిన ద్విచక్ర వాహనాల సహాయంతో ఏడు రాష్ట్రాలు చుట్టి వచ్చానని తెలిపారు. గత సంవత్సరం ఆగస్టు 21న రాజస్థాన్‌లో యాత్ర చేపట్టానని తిరిగి రాజస్థాన్ వెళ్లి ముగింపు చేస్తానని తెలిపారు.



రేయి పగలు తేడా లేకుండా, ఎటువంటి అనుమతులు, పర్మిట్‌లు లేకుండా అక్రమార్కులు సాగిస్తున్న తవ్వకాల కారణంగా పీలేరు ప్రాంతంలోని అనేక చెరువులు, కుంటలు బంగారు, బొగ్గు గనులను తలపిస్తున్నాయి. అధికారులు, అధికార పార్టీ నేతలకు మామూళ్లు ఇస్తూ తమ అక్రమ వ్యవహారాలకు అడ్డు లేకుండా చూసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తే నయానో భయానో దారికి తెచ్చుకోవడం, లొంగకపోతే అధికార పార్టీ నేతల పేర్లు, జాతీయ రహదారి నిర్మాణం పేరు చెప్పి బెదిరించడం వంటి పనులకు పాల్పడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల పనుల్లో అధికారులు బిజీగా ఉండడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు.



గూడరేవుపల్లె గంగమ్మ కనుమ గుట్టలో మట్టి తవ్వుతున్న రియల్టర్లు

తవ్వేస్తున్నారు..

- అక్రమ మట్టి తవ్వకాలతో పీలేరు విలవిల!
- ఎన్‌హెచ్ పేరుతో యథేచ్ఛగా దోచుకుంటున్న అక్రమార్కులు
- బొగ్గు, బంగారు గనులను తలపిస్తున్న చెరువులు, గుట్టలు
- ఎన్నికల పనుల్లో అధికారులు బిజీ
- అడ్డుకున్న గూడరేవుపల్లె గ్రామస్థులు, అధికారులకు ఫిర్యాదు
- క్రిమినల్ కేసులు పెడతామన్న జేసీ



బొగ్గు గనులను తలపిస్తున్న గూడరేవుపల్లె ఆది కుంట చెరువు



శిథిలావస్థకు చేరుకున్న గూడరేవుపల్లె వంతెనపై రాకపోకలు సాగిస్తున్న టిప్పర్లు



ఆది కుంటలో తవ్వకాలు అడ్డుకుంటున్న గూడరేవుపల్లె గ్రామస్థులు

పీలేరు, ఏప్రిల్ 10: రహదారులు నాగరికతకు చిహ్నాలంటారు. రహదారులు బాగుంటే ఆ ప్రాంతం అభివృద్ధి పథంలో నడుస్తుందంటారు. అయితే పీలేరు ప్రాంతంలో నిర్మితమవుతున్న ఎన్‌హెచ్-71 నిర్మాణం పూర్తికాక ముందే పీలేరు ప్రాంతంలోని అక్రమ మట్టి వ్యాపారులకు కాసులు కురిపిస్తోంది. ఎన్‌హెచ్-71 నిర్మాణం ముసుగులో పీలేరు ప్రాంతంలోని అక్రమ మట్టి వ్యాపారులు యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా సాగిస్తున్నారు. వారు సాగిస్తున్న అక్రమ మట్టి తవ్వకాలకు పీలేరు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లోని చెరువులు, గుట్టలు విలవిల్లాడుతున్నాయి. పీలేరు పట్టణానికి సమీపంలో ఉన్న గూడరేవుపల్లె పంచాయతీలో వీరి ఆగడాలు మరీ ఎక్కువైపోయాయి. గూడరేవుపల్లె పంచాయతీ పరిధిలోని గంగమ్మ కనుగగుట్ట, గూడరేవుపల్లె రైతుల ఆయకట్టు ఉన్న ఆది కుంటలో మూడు నెలలుగా అక్రమంగా మట్టి తవ్వుతున్నారు. వీరి ఆగడాలు భరించలేక గూడరేవుపల్లె గ్రామస్థులు టిప్పర్లను మంగళవారం రాత్రి అడ్డుకోవడంతో అక్రమ మట్టి వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

టిప్పరు మట్టి రూ.3 వేలకు విక్రయం

పీలేరు ప్రాంతంలోని భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నిత్యం ఎక్కడో ఒకచోట ఓ లేఔట్ నిర్మాణం జరుగుతూ ఉంటుంది. ఆ లేఔట్లను సుందరంగా తయారు చేయడంతో పాటు ఎత్తుపల్లాలు ఉన్న భూములను చదును చేసేందుకు పెద్దఎత్తున మట్టి అవసరం ఉంటుంది. ఈ అవసరాన్ని కొంతమంది అక్రమార్కులు తమ ఆదాయ వనరుగా మార్చుకున్నారు. పీలేరు పట్టణానికి ఆనుకుని ఉన్న గూడరేవుపల్లె, ముడుపులవేముల, ఎర్రగుంటపల్లె, దొడ్డిపల్లె పంచాయతీల్లోని గుట్టలు, చెరువులు, కుంటల్లో మట్టిని అక్రమంగా తవ్వి రియల్టర్లకు విక్రయిస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్లో ఒక్కో టిప్పరు మట్టి ధర రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు పలుకుతోంది.

పీలేరు మండలం గూడరేవుపల్లెకు ఆనుకుని ఉన్న ఆది కుంట, గంగమ్మ కనుక గుట్టలోనూ అక్రమార్కులు గత ఏడాది డిసెంబరు ఆఖరు నుంచి మట్టి తవ్వకాలు ప్రారంభించారు. మొదట్లో జాతీయ రహదారికి మట్టి సరఫరా చేసేందుకు సబ్-కాంట్రాక్టు తీసుకున్నామని చెప్పారు. ఎంతకీ మట్టి రవాణా ఆగకపోవడంతో నెల రోజుల క్రితం గూడరేవుపల్లెకు చెందిన కొంతమంది రైతులు వారిని ప్రశ్నించారు. ప్రశ్నించిన వారిని గూడరేవుపల్లెకే చెందిన అధికార పార్టీ నేతలు, రెవెన్యూ అధికారుల పేర్లు చెప్పి నోర్లు మూయించారు. నెల రోజులు కావస్తున్నా మట్టి రవాణా ఆగకపోవడం, ఆది కుంట చెరువు కట్ట వద్ద కూడా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో గూడరేవుపల్లె గ్రామస్థులు మంగళవారం రాత్రి టిప్పర్లను అడ్డుకున్నారు. గ్రామస్థులు అడ్డుకున్నా వెనక్కు తగ్గని అక్రమార్కులు మీపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బెదిరించారు. అయినప్పటికీ వారు బెదరకపోవడంతో టిప్పర్లు వదిలేసి వెళ్లిపోయారు. టిప్పర్లు వదిలేసి వెళ్లిపోయిన విషయం తెలుసుకున్న మరికొంతమంది గూడరేవుపల్లె గ్రామస్థులు బుధవారం ఉదయం ఆది కుంట చెరువు వద్దకు చేరుకుని తమ నిరసన వ్యక్తం చేశారు. గత ఏడాది డిసెంబరు నుంచి తమ చెరువులో అక్రమంగా మట్టి తవ్వుకుంటున్నారని, సుమారు 3 వేల టిప్పర్ల మట్టిని అక్రమంగా తరలించుకుపోయారని, ఒక్కో టిప్పరు రూ.3 వేలకు విక్రయించుకుని ఉన్నా తమ చెరువు ద్వారా వారు రూ.90 లక్షల దాకా ఆర్జించారని వారు తెలిపారు. ఆది కుంట చెరువు కట్ట తెగిపోతుందని వాపోయినా వారు పట్టించుకోలేదని, చేసేది లేక టిప్పర్లను అడ్డుకున్నామని వారు తెలిపారు. అదే విధంగా గూడరేవుపల్లె-తలపుల మార్గంలోని గంగమ్మ కనుమ గుట్టలోనూ అక్రమార్కులు యథేచ్ఛగా మట్టిని తవ్వుకుంటున్నారు. అడ్డు వచ్చిన వారిని అధికార పార్టీ నేతల పేర్లు చెప్పి బెదిరించడం, అధికారులకు చెప్పే మట్టి తోలుకుంటున్నామని చెబుతున్నారని గ్రామస్థులు ఆరోపించారు.

నిద్రావస్థలో రెవెన్యూ యంత్రాంగం

సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్ల పేరుతో పీలేరు రెవెన్యూ యంత్రాంగం మొద్దు నిద్ర నటిస్తోందనే విమర్శలు స్థానికంగా వినిపిస్తున్నాయి. మూడు, నాలుగు నెలలుగా అక్రమ మట్టి రవాణా జరుగుతున్నా పట్టించుకోకపోవడమే అందుకు సాక్ష్యమని స్థానికులు విమర్శిస్తున్నారు. ఆది కుంట చెరువు, గంగమ్మ కనుమ గుట్టలో నుంచి తీసిన మట్టిని రేయి పగలూ తేడా లేకుండా పీలేరు-తలపుల మార్గంలో నిత్యం తరలిస్తున్నా, వీఆర్వో, వీఆర్‌ఏ పట్టించుకోలేదని గూడరేవుపల్లె గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా తమ గ్రామ సమీపంలోని వంతెన ఇప్పటికే శిథిలావస్థకు చేరుకుందని, దానిపై రోజుకు వందలాది టిప్పర్లు రాకపోకలు సాగిస్తుంటే అది ఏ క్షణంలో కూలిపోతుందోనన్న భయం తమలో నెలకొందని వారు తెలిపారు.

రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు

గూడరేవుపల్లె గ్రామస్తులు తమ గ్రామంలో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలపై బుధవారం స్థానిక తహసీల్దారు మహబూబ్‌బాషాకు ఫిర్యాదు చేశారు. ఎటువంటి అనుమతులు లేకపోయినా జాతీయ రహదారి పేరు చెప్పి తమ ప్రాంతంలోని మట్టిని తరలిస్తున్న వైనాన్ని వారు ఆయనకు వివరించారు.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం : జేసీ

అక్రమ మట్టి వ్యవహారంపై జాయింట్ కలెక్టర్ ఫర్హాన్ అహ్మద్‌ఖాన్ సీరియస్‌గా స్పందించారు. అక్రమార్కుల వాహనాలను సీజ్ చేయడమే కాకుండా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తహసీల్దారు మహబూబ్‌బాషాను ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లలో తలమునకలై ఉన్నందువల్ల అక్రమ వ్యవహారాలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించలేకపోయామని, భవిష్యత్తులో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది ద్వారా ఇటువంటి వ్యవహాలకు చెక్ పెడతామని ఆయన తెలిపారు.

ఆది కుంట చెరువు కట్ట వద్ద కూడా తవ్వకాలు జరిపిన వైనం





రాజంపేట మండలం బసినాయుడుగారిపల్లెలో సుగవాసి బాలసుబ్రమణ్యంకు గజమాలతో ఘన స్వాగతం పలుకుతున్న గ్రామ ప్రజలు

రాజంపేటలో సుగవాసి ప్రచారం ప్రారంభం

- ప్రచారంలో పాల్గొన్న చమర్తి జగన్‌మోహన్‌రాజు, పోలి సుబ్బారెడ్డి

రాజంపేట, ఏప్రిల్ 10: తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం బుధవారం రాజంపేట పట్టణం, రూరల్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. బుధవారం తెల్లవారుజామునే రాజంపేట పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ప్రచార ప్రారంభోత్సవ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, టీడీపీ నియోజకవర్గ నాయకుడు పోలి సుబ్బారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేశ్‌నాయుడు, జనసేన పార్టీ నాయకులు కత్తి సుబ్బరాయుడు, మాజీ సమితి అధ్యక్షుడు నాగా పెద్దిరెడ్డి కుమారుడు, మాజీ మండల ఉపాధ్యక్షులు నాగా సుధాకర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, మాజీ జడ్పీటీసీ సరస్వతి, టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు పత్తిపాటి కుసుమకుమారిలు ప్రచారంలో పాల్గొన్నారు. రాజంపేట పట్టణంలోని ఈడిగపాలెం, బ్రాహ్మణవీధి, పోలీసు లైను వీధి, గాంధీ సర్కిల్, పొట్టిశ్రీరాములు వీధి, మెయిన్ రోడ్డులలో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. టీడీపీ కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ పట్టణ, రూరల్ నాయకులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే విధంగా రాజంపేట మండలం బసినాయుడుగారిపల్లెలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎగువ, దిగువ బసినాయుడుగారిపల్లె గ్రామస్థులు పెద్దఎత్తున బాణాసంచా పేలుస్తూ గజమాలలు వేస్తూ స్వాగతించారు. కార్యక్రమంలో రాజంపేట మండల పార్టీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బాపనయ్య నాయుడు, కొండయ్య నాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, పట్టణ మాజీ అధ్యక్షుడు సంజీవరావు, రైల్వేకోడూరు నియోజకవర్గ టీడీపీ నాయకులు నందవరపు అజయ్‌బాబు, మాజీ ఎంపీటీసీ గుడారు సుబ్రమణ్యంనాయుడు, కావుటూరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కావుటూరి సుబ్రమణ్యంనాయుడు, కాకతీయ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు శివన్నారాయణ చౌదరి, టీడీపీ యువ నాయకులు దొంతం శివ, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్.వి.రమణ, టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, హత్యరాల దేవస్థాన మాజీ చైర్మన్ బండారు బాలయ్య, యువ నాయకుడు పిడికిటి సంతోశ్ నాయుడు, మాజీ కౌన్సిలర్లు గుగ్గిళ్ల చంద్రమౌళి, మనుబోలు వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ చిన్న, పిడికిటి నాగేశ్వరరావు, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మాలేపాటి రామకృష్ణంనాయుడు, రాజంపేట మండల ప్రధాన కార్యదర్శి అబూబకర్, రాజంపేట మండల టీడీపీ సీనియర్ నాయకులు కూచివారిపల్లె వెంకటయ్య, మల్లికార్జునాయుడు, సరస్వతీపురం నాయకులు సుధాకర్, మహిళా నేతలు టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షురాలు వాణి, మిరియాల జ్యోతి, పిడికిటి రత్నకుమారి, నందవరపు సునంద, అనసూయమ్మ, నాగభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.



రాజంపేట ఎన్నికల ప్రచారంలో బాలసుబ్రమణ్యం, జగన్‌మోహన్‌రాజు, పోలి సుబ్బారెడ్డి

నేడే రంజాన్

- సామూహిక నమాజు కోసం

ముస్తాబైన ఈద్గాలు

పీలేరు, ఏప్రిల్ 10: కఠిన ఉపవాసాలతో 30 రోజులు గడిపిన ముస్లింలు రంజాన్ మాసం ముగింపు సంకేతంగా గురువారం ఈతుల్ ఫితర్ (రంజాన్) పండుగ జరుపుకోనున్నారు. గల్ఫ్ దేశాల్లో బుధవారం పండుగ పూర్తయిపోవడంతో మన దేశంలో గురువారం జరుపుకుంటున్నారు. 30 రోజుల ఉపవాసాలు, దానధర్మాలు, తరావీహ్ నమాజులు, జకాత్, ఫిత్రా దానాలతో క్షణం తీరిక లేకుండా గడిపిన ముస్లింలు రంజాన్ పండుగ సందర్భంగా తమ గ్రామ ఈద్గాలలో సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తారు. రంజాన్, బక్రీద్ పండుగ నమాజుల కోసం సామూహికంగా ఈద్గాలకు వెళ్లడం, అక్కడ నమాజు ఆచరించడం ఆనవాయితీ. ఆ ఆనవాయితీలో భాగంగా గురువారం జిల్లాలోని ఈద్గాలలో పండుగ నమాజు ఉండడంతో ఆయా ఈద్గాల కమిటీ సభ్యులు వాటిని సుందరంగా అలంకరించారు. ఆ క్రమంలో బుధవారం ఉదయం పీలేరు-మదనపల్లె మార్గంలోని ఈద్గాను పీలేరు అర్బన్ సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ నరసింహుడు, పలువురు ముతవల్లీలు సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగ నమాజు గురువారం ఉదయం 8.30 గంటలకు నిర్ణయించామని, ఆ సమయానికి ప్రజలందరూ ఈద్గాకు చేరుకోవాలని, ఈద్గాకు సామూహికంగా చేరుకోవడానికి స్థానిక జెండామాను నుంచి జమాత్ ఉదయం 7.45 గంటలకు బయలుదేరుతుందని వారు తెలిపారు. నిర్దేశించిన సమయానికి అందరూ ఈద్గాకు చేరుకుంటే రోడ్డుపై నమాజు ఆచరించాల్సిన అవసరం ఉండదని, ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అందరూ సమయపాలన పాటించాలని వారు అభ్యర్థించారు.

పీలేరుతో పాటు మండలంలోని శివరామాపురం, రేగళ్లు, బోడుమల్లువారిపల్లె, తలపుల గ్రామాల్లో సైతం ఈ ద్గాలను సిద్ధం చేశారు. అలాగే జిల్లాలోని రాయచోటి, మదనపల్లె, రాజంపేట, రైల్వేకోడూరు, ములకలచెరు వు, అంగళ్లు ప్రాంతాల్లో ఈద్గాలను సిద్ధం చేశారు.

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు : కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 10: పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, క్రమశిక్షణ, దాతృత్వం, దార్మిక చింతనల మేళవింపే రంజాన్ పండుగ ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు.

నేటి నుంచి పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలు

- నేడు అంకురార్పణ



వాల్మీకిపురం, ఏప్రిల్ 10: వాల్మీకిపురం పట్టాభిరామాలయంలో టీటీడీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 12వ తేదీ శుక్రవారం ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం గజవాహనసేవ, 13న శనివారం ఉదయం ముత్యపు పందిరి వాహనం, సాయంత్రం హనుమంత వాహనసేవ, 14న ఆదివారం కల్పవృక్ష వాహనం, సాయంత్రం ఊంజల్‌సేవ, సింహవాహనంపై పట్టాభిరాముడి నగరోత్సవం 15న సోమవారం ఉదయం సర్వభూపాలవాహనం, సాయంత్రం పెద్దశేషవాహనం, 16న మంగళవారం ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం, మోహిని ఉత్సవం, 17న బుధవారం సాయంత్రం సీతారాముల కల్యాణం వైభవంగా జరగనుంది. అదేరోజు రాత్రి గరుడ వాహన సేవ, 18న గురువారం ఉదయం రథోత్సవం, సాయంత్రం ధూళి ఉత్సవం, 19న శుక్రవారం ఉదయం తిరుచ్చి, సాయంత్రం అశ్వవాహన సేవ, పార్వేట ఉత్సవం, 20న శనివారం ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం, సాయంత్రం హంసవాహన సేవ, రాత్రికి ధ్వజావరోహణ, 21న ఆదివారం చివరి రోజున ఉదయం స్నపనతిరుమంజనం, సాయంత్రం పట్టాభిరాముడికి పుష్పయాగం కార్యక్రమాలు జరగనున్నాయి.

సరిహద్దు చెక్‌పోస్టుల తనిఖీ

- రికార్డులు పరిశీలించిన అడిషనల్ ఎస్పీ

పెద్దతిప్పసముద్రం, ఏప్రిల్ 10: ఎన్నికల దృష్ట్యా కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టులను బుధవారం జిల్లా అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్ తనిఖీ చేశారు. ముందుగా ఆయన కర్ణాటక సరిహద్దు మారుగానిపల్లె చెక్‌పోస్టును తనిఖీ చేశారు. అక్కడ రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అక్రమ మద్యం డబ్బులు, మాదకద్రవ్యాలు వంటి మత్తు పదార్థాలను తరలిస్తున్న వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం అంకాలమడుగు చెక్‌పోస్టును తనిఖీ చేశారు. అక్కడ పలు వాహనాలను తనిఖీ చేశారు. అక్కడి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. చెక్‌పోస్టుల్లో రాత్రి వేళల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా కర్ణాటక సరిహద్దు దగ్గరగా ఉండడంతో సిబ్బంది చాలా అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. కర్ణాటక మద్యం, అక్రమంగా డబ్బులు తరలించడం వంటివి జాగ్రత్తగా చూసుకోవాలని, డబ్బు, మద్యం పట్టుబడితే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి వాటిని వెంటనే వీడియో తీయాలన్నారు. సిబ్బంది ఎటువంటి అక్రమాలకు చోటులేకుండా ఉద్యోగ ధర్మాన్ని పాటించాలన్నారు. ఎవరైనా సిబ్బంది అక్రమాలకు పాల్పడితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట పీటీఎం ఎస్ఐ రవీంద్రబాబు, పీటీఎం పోలీసులు ఉన్నారు.



కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టులో సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ

కమ్ముకుంటున్న కరువు ఛాయలు

- నీరు, మేతలేక అలమటిస్తున్న మూగజీవాలు
- వలసబాట పట్టిన గొర్రెల కాపారులు
- గత్యంతరం లేక సంతల్లో విక్రయిస్తున్న వైనం



ఎండిన పొలంలో మేతమేస్తున్న గేదెలు

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 10: అసలే కరువు ప్రాంతం... గత ఐదేళ్ల నుంచి అర కొర వర్షాలతో సాగుచేసిన పంటలు చేతికందక రైతన్నలు అప్పులు ఊబిలో కూరుకుపోయారు. దీంతో వ్యవసాయం అంటే విసుగు చెందిన రైతులు పాడి పశువులు, మేకలు, గొర్రెలుతో జీవనం సాగిస్తున్నారు. ఈ తరుణంలో ఈ ఏడాది తీవ్ర వర్షాభావం నెలకొనడంతో కరువు చాయలు అలుముకున్నాయి. పంటలు కూడా పెద్దగా సాగుకు నోచుకోలేదు. అరకొరగా సాగుచేసిన పంటలు సక్రమంగా వర్షాలు కురవకపోవడంతో పొలాలల్లోనే వదిలేశారు. దీంతో బతుకుదెరువు కోసం మండలంలో చాలా గ్రామాలలో మేకలు, గొర్రెలు, గేదలు, ఆవులు పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

మండల వ్యాప్తంగా 10 వేలు మేకలు, 60 వేలు గొర్రెలు, 13 వేల పాడి పశువులు ఉన్నాయి. పాళెంగొల్లెపల్లె, అనంతపురం గొల్లపల్లె, పందిళ్లపల్లె, మేడిమాకులగుంత, గొల్లపల్లె, పర్వతరెడ్డిగారిపల్లె, బి.ఎర్రగుడి గ్రామాలలో ఎక్కువగా గొర్రెల కాపరులు ఉన్నారు. పాళెంగొల్లపల్లె, బి.ఎర్రగుడి ప్రాంతాల సమీపంలో శేషాచల కొండలు ఉన్నాయి. ఈ కొండ ప్రాంతంలో ఆకులు అలుములు మేపుకుంటూ జీవాలను పోషించుకుంటున్నారు. అయితే ప్రస్తుతం వేసవిలో తాగడానికి గుక్కెడు మంచినీరు లేక గొర్రెల, మేకల కాపరులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాహార్తితో కొన్ని జీవాలు మృత్యువాత పడుతున్నాయని గొర్రెకాపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో దూరప్రాంతాలకు వలసలు వెలుతున్నారు. కొందరు జీవాలను పోషణ భారం కావడంతో రామాపురం, గాలివీడు సంతలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. 10 వేలు అమ్మే గొర్రెలు, మేకలను తక్కువ ధరకు అమ్ముకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇక పాడిఆవులు, గేదలు పరిస్థితి దయనీయంగా ఉంది. ఊర్లల్లో మనుష్యులు తాగడానికి గుక్కెడు మంచి నీరు దొరకడం లేదు ఇక పశువుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది, ఎక్కడేగాని కుంటులు, బావులు, బోర్లల్లో నీరులేక రైతన్నలు గగ్గోలు పెడుతున్నారు. గుక్కెడు మంచినీటి కోసం వ్యవసాయబోర్ల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. అక్కడ నుంచి పశువులకు నీళ్ల తేవాలంటే సాధ్యం కావడంలేదని చెబుతున్నారు. పాడి పశువులతో రోజుకు 10 నుంచి 20 లీటర్ల పాలను విక్రయిస్తు జీవనం సాగిస్తున్నామని.. నీరులేక పోవడంతో సంతలో విక్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. మేత కోసం వరిగడ్డి కొనాలంటే టాక్టర్ గడ్డి రూ.15000, వేరుశనగకు రూ.20 వేల నుంచి రూ.30 వేలు పెట్టి కొనుగోలు చేస్తున్నామని పలుకుతోందని పాడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా చిత్తూరు నుంచి శైలజాగడ్డి కిలో రూ.7.50ల వంతను టన్ను గడ్డి రూ.7,500లు పెట్టి కొనుగోలు చేసి పాడి పశువులను కాపాడుకుంటున్నామని చెబుతున్నారు. గత ప్రభుత్వంలో పశువులకు తొట్లు కట్టించి అందులో నీళ్ల నింపేవారని.. అంతేకాకుండా దాణా, వట్టిగడ్డి, గడ్డి గింజలను సబ్సిడీ కింద ఇచ్చేవారని.. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం ఎలాంటి కరువు సహాయక చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గడ్డి కొనుగోలు చేసి కాపాడుకుంటున్నా..



వ్యవసాయంలో నష్టాలు రావడంతో మూడేళ్ల నుంచి పాడి ఆవులతో జీవనం సాగిస్తున్నాం. మొత్తం 20 ఆవులు ఉన్నాయి. వీటి కోసం బోరు వేసి గడ్డి సాగుచేసి పాడి ఆవులను కాపాడు కుంటున్నా. కరువుతో బోరులో నీరు ఎండిపోవడంతో శైలజ గడ్డి టన్ను రూ.7500లతో కొనుగోలు చేసి పశువులను కాపాడుకుంటున్నాం. ప్రభుత్వం ఎలాంటి సహాయక చర్యలు చేపట్టలేదు.

- మునిరెడ్డి, కొండవాండ్లపల్లె కోనంపేట

పశువులకు మేత, నీరు కరువు



10 సంవత్సరాల నుంచి పాడిపశువలతో జీవనం సాగిస్తున్నాం. ఫిబ్రవరి నుంచి బోర్లలో నీరు ఎండిపోవడంతో పాడి ఆవులకు నీరు మేత కరు వైంది. గత ప్రభుత్వంలో సబ్సిడీ కింద దాణా, మిక్చర్, గడ్డి గింజలు వంటివి సబ్సిడీతో అందించేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో పాడి పశువుల గురించి పట్టించుకోవడం లేదు. టాక్టర్ వేరుశనగ కట్టె కొనాలంటే రూ.25 వేల నుంచి రూ.30వేలు పలుకుతోంది. ప్రభుత్వం ఆదుకోకపోతే పాడి ఆవులను విక్రయించాలనుకుంటున్నాం.

- కొనసాని రాజారెడ్డి, పాడిరైతు, కొనసారివారిపల్లె



వలస వెళుతున్న గొర్రెల కాపరులు



ట్రాక్టర్‌తో వరిగడ్డిని తెచ్చుకుంటున్న రైతులు

దాణా కోసం నివేదికలు పంపించాం..

ఈ ఏడాది వర్షాలు కురవకపోవడంతో పాడిపశువుల కోసం 300 టన్నుల సమీకృత దాణాకు నివేదికలు పంపించాం. మూగజీవాల తాగునీటి కోసం అక్కడక్కడ గ్రామాలల్లో తోట్లు ఉన్నాయి. నీరు నింపేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మూగజీవాలను ఆదుకోవాలంటే అదొక్కటే మార్గం. ఈ విషయాన్ని ఉన్నతాధికారులే నిర్ణయించాలి.

- రమేష్, పశువైద్యాదికారి, పందిళ్లపల్లె

ఈవీఎంల భద్రతపై సమీక్ష

- స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన కలెక్టరు, ఎస్పీ



అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎస్పీ కృష్ణారావు

రైల్వేకోడూరు(రూరల్) ఏప్రిల్ 10: ఈవీఎంల భద్రతపై కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ జిల్లా ఎస్పీ కృష్ణారావుతో కలిసి బుధవారం మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల వద్ద సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు మేరకు స్ట్రాంగ్ రూమ్‌లో అన్ని ఏర్పాటు పూర్తి చేశారా లేదా తదితర అంశాలపై కోడూరు రిటర్నింగ్ అధికారి టి.లీలారాణిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం వాహనాల పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలించారు. పోలింగ్ విధులకు వచ్చిన అధికారులు సిబ్బంది వాహనాలు ఎక్కడ పార్కింగ్ చేస్తారు, అలాగే పోలింగ్ కేంద్రాలకు తరలించాల్సిన బస్సులను ఏ విధంగా పార్కింగ్ చేస్తారని స్థానిక పోలీస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల రూట్ మ్యాపులు, వాహనాల పార్కింగ్ పక్కాగా రూపొందించుకోవాలన్నారు. భద్ర త ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ స్థానిక పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. డిస్ట్రిబ్యూషన్ మరియు రిసెప్షన్ ప్రక్రియలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట ఆర్డీవో మోహన్ కుమార్, డీఎస్పీ చైతన్య, సంబంధిత తాహసీల్దారులు, రెవెన్యూ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎటువంటి ఆధారాలు లేని రూ.3,39,500 నగదు పట్టివేత

రాయచోటిటౌన్, ఏప్రిల్ 10: ఎన్నికల నేపథ్యంలో రాయచోటి పట్టణంలోని కడప రోడ్డు మార్గంలో గురువారం ఎస్ఐ జయరాములు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈనేపథ్యంలో అమానుల్లా అనే వ్యక్తి ఎటువంటి ఆధారాలు లేకుండా తీసుకెళుతున్న రూ.3,39,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న నగదును అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు సీజ్ చేసి ట్రెజరీకి అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రజలు ఎవరైనా అత్యవసర పరిస్థితుల్లో కానీ, ఇతర అవసరాల నిమిత్తం కానీ రూ.50వేలకు మించి ఉన్నట్లయితే తగిన ఆధారాలతో నగదును తీసుకెళ్లవచ్చునని తెలిపారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది రామచంద్ర, జగన్, రామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న కారు.. ఇరువురికి తీవ్రగాయాలు

ముద్దనూరు ఏప్రిల్ 10: మండల పరిధి ఎర్రగుంట్ల రోడ్డులోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో బుధవారం బైకును కారు ఢీకొన్న సంఘటనలో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు... సింహాద్రిపురం టౌన్‌కు చెందిన అన్నదమ్ములు శశిధర్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి అనే యువకులు బైకులో ఎర్రగుంట్ల వైపు వెళుతుండగా కారు ఢీకొంది. దీంతో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. ప్రాణాపాయస్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. వీరిని 108లో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి, ప్రమాదానికి గురైన ద్విచక్రవాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముద్దనూరు ఏప్రిల్ 10: కడప, తాడిపత్రి హైవేపై కొత్త చౌటిపల్లె వద్ద ఈ నెల 4వ తేదీన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వెంకటేశ్వర్లు(47) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. వెంకటేశ్వర్లు అత్తగారి ఇంటికి ముద్దనూరుకు బైకులో వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రగాయాలవడంతో తిరుపతిలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తెల్లవారు జామున మృతి చెందినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్టు

ముద్దనూరు ఏప్రిల్ 10: మండల పరిధి పెద్దదుద్యాల గ్రామంలో బుధవారం కోడిపందెం ఆడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ దస్తగిరి తెలిపారు. 10 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని 4 పందెం కోళ్ల, రూ.7,710 నగదు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వైభవంగా వద్దిరాల సుంకులాంబ తిరుణాళ్ల





ప్రత్యేక అలంకరణలో సుంకులాంబ అమ్మవారు, సిరిమాను ఊరేగింపు మహోత్సవం

మైలవరం, ఏప్రిల్ 10: మండల పరిధిలోని వద్దిరాలలో వెలసిన సుంకులాంబ పరంజ్యోతి అమ్మవారి తిరుణాళ్ల మహోత్సవాలు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. స్థానికులే కాక నంద్యాల, అనంతపురం, కర్నూల్ తదితర జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుణాళ్లను పురస్కరించుకుని సుంకులాంబ అమ్మవారిని, ఆలయాన్ని ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. సిరిమాను మహోత్సవం వేడకగా నిర్వహించారు. కడప టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి, జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి, కడప వైసీపీ ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాశ్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌రెడ్డి తదితర నేతలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. జమ్మలమడుగు, రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి, కరుణాకర్ ఆధ్వర్యంలో తలమంచి పట్నం, మైలవరం, ఎస్ఐలు హనుమంతు, రెడ్డిసురేష్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

భక్తి, శ్రద్ధలతో పెద్ద పీరయ్య స్వామి గ్రామోత్సవం







గ్రామోత్సవంలో ఊరేగుతున్న పెద్దపీరయ్య స్వామి, బండలాగుడు పోటీలు, విజేతలకు బహుమతులు అందజేస్తున్న దాతలు

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 10 : ముడుమాల గ్రామం సిద్దయ్య గారి మఠంలోని పెద్ద పీరయ్య స్వామి గ్రామోత్సవం వేడుకగా నిర్వహించారు. ఆరాధన మహోత్సవాల్లో భాగంగా బుధవారం పురవీధుల్లో పెద్ద పీరయ్యస్వామి సమేత నాగులాంబ అమ్మవారిని నిర్వాహకులు ఊరేగించారు. సాయంత్రం వృషభరాజులచే చిన్న బండలాగుడు, పెద్ద బండలాడుగు పోటీలను చేపట్టారు. ఈ పోటీల్లో విజేత వృషభ రాజుల యజమానులకు బహుమతులు అందజేశారు.

కార్యక్రమంలో సిద్దయ్యగారి మఠం యాజమాన్యం, కమిటీ సభ్యులు, నిర్వాహకులు, దాతలు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

తంబళ్లపల్లె, ఏప్రిల్ 10: కర్ణాటక మద్యం కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు న మోదు చేసినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. .తంబళ్లపల్లె మండలం ఆర్ఎన్ తాండా సమీపంలో కర్ణాటక మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావటంతో ఎస్ ఈబీ ఎస్ఐ వెంకటేష్, తమ సిబ్బందితో కలసి దాడులు చేశారు. ఎద్దుల వేమన్నగారిపల్లెకు చెందిన గోవింద్ వద్ద 180ఎంఎల్ 336 కర్నాటక టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, అతనిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. నిందితుడిని రిమాండు కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు. సిబ్బంది గోపాలకృష్ణ, రాఘవేంద్ర, కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

100లీటర్ల నాటుసారా సీజ్.. ఒకరి అరెస్ట్

వాల్మీకిపురం, ఏప్రిల్ 10: వాల్మీకిపురం మండలంలో 100 లీటర్ల నాటుసారాను పోలీసులు స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు. సీఐ పులి శేఖర్ కథనం మేరకు మండలంలోని చింతపర్తి గ్రామ పంచాయతీ మేకలవారిపల్లెకు చెందిన కె.నాగరాజు(47) సారా అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి 100లీటర్లు నాటు సారా స్వాధీనం చేసుకుని, అతనిని అరెస్టు చేశారు. నిందితుణ్ణి రిమాండు నిమిత్తం కోర్టుకు హాజరుపరిచారు. ఎస్ఐ నాగేశ్వర్‌రావ్ పాల్గొన్నారు.

యాచకురాలు మృతి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 10: మండలంలోని కొత్తపల్లె సమీప పొల్లాలో గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. కొత్తవారిపల్లె, ఈశ్వరమ్మ ఇండ్లు, ప్రాంతాల్లో యాచిస్తూ జీవనం గడుపుతున్న మహిళగా పోలీసులు గుర్తించారు. ఆమె చని పోయి నాలుగైదు రోజులు గడిచినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహం కుళ్లి పోయి గుర్తు పట్టలేని స్థితిలో కనపించింది. దీంతో అక్కడే పంచనామా నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ శేఖర్ తెలిపారు.

ఎన్నికల ప్రశాంత నిర్వహణకు సహకరించాలి

పీలేరు, ఏప్రిల్ 10: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని జేసీ ఫర్మాన్ అహ్మద్ పీలేరు నియోజకవర్గంలోని రాజకీయ పార్టీలకు సూచించారు. ఎన్నికల ఏర్పాట్లపై బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. ఎన్నికల నిబంధనలు కఠినంగా అమలు చేస్తున్నామని, ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి నియోజకవర్గంలో 5 కేసులు నమోదు చేసి రూ.23.79 లక్షల నగదు జప్తు చేశామన్నారు. ఎన్నికల నియామవళి అతిక్రమించిన 6 మంది కాంట్రాక్టు ఉద్యోగులు, 8 మంది వలంటీర్లను విధుల నుంచి తొలగించామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 122 మంది వలంటీర్లు తమ విధులకు రాజీనామా సమర్పించారని వెల్లడించారు. ఇప్పటి వరకు వివిధ రాజకీయ పార్టీల ప్రచార సభలు, వాహనాలకు 163 అనుమతులు మంజూరు చేశామన్నారు. సీ-విజిల్ యాప్ ద్వారా అందిన 8 ఫిర్యాదులను పరిష్కరించా మన్నారు. ఇంటింటి ప్రచారానికి రాజకీయ పార్టీలు ముందస్తు అనుమతి తీసుకోవాలని, కరపత్రాలు పంచడానికి కూడా ముందస్తు అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలను అందరూ విధిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు మహబూబ్ బాషా, ఖతీజున్ ఖుబ్రా, ప్రదీప్, డీటీలు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్యుల సలహాలు తప్పక పాటించాలి



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న దేవ శిరోమణి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 10: గర్భిణులు వైద్యుల సలహాలను తప్పనిసరిగా పాటించాలని అన్నమయ్య జిల్లా మాస్ మీడియా అధికారిణి (డెమో) దేవ శిరోమణి అన్నారు. బుధవారం రాయచోటి మండల పరిధిలోని యండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృవందన యోజన కార్యక్రమాన్ని డాక్టర్ శారద ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మాస్ మీడియా అధికారిణి గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు, చికిత్సలతో పాటు ఆరోగ్య పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు, వ్యాయామం, నిద్ర తదితర అంశాలపైన అవాహన కల్పించారు. అలాగే లింగ నిష్పత్తి జిల్లా వ్యాప్తంగా చాలా తక్కువగా 1000 మంది పురుషులకు 742 వంది మహిళలు ఉన్నారన్నారు. సృష్టిలో స్త్రీ, పురుషులు ఇరువురు సమానమన్నారు. ఈ విషయాలను మీ కుటుంబాలకు మీ చుట్టుపక్కల వారికి, మీ స్నేహితులకు అవగావన కల్పించాలని సూచించారు. వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా పసిపిల్లలు, గర్భిణులు, చిన్నబిడ్డలు జాగ్రత్తగా ఉండాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ సుగుణ, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, స్టాఫ్ నర్స్ కవిత, ఆశాలు, వైద్యసిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

కడప, పులివెందులలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యం

వేంపల్లె, ఏప్రిల్ 10: సార్వత్రిక ఎన్నికల్లో కడప లోక్‌సభ, పులివెందుల అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్ జండా ఎగరవేయడమే లక్ష్యమని మాజీ రాజ్యసభ సభ్యుడు, పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన మాట్లాడుతూ పులివెందుల తొలి నుంచి కాంగ్రెస్‌కు కంచుకోట అన్నారు. ఇంత వరకు 17సార్లు ఎన్నికలు జరగ్గా 13సార్లు కాంగ్రెస్ గెలిచిందన్నారు. నియోజకవర్గంలో సింహభాగం అభివృద్ధి కాంగ్రెస్ పాలనలోనే జరిగిందన్నారు. పైడిపాళెం రిజర్వాయర్, లింగాల కెనాల్, గండికోట-సీబీఆర్ ఎత్తిపోతల, జేఎన్టీయూ, ట్రిపుల్‌ఐటీ, పశుపరిశోధన కేంద్రం, శిల్పారామం, రింగురోడ్డు, సిమెంటు రోడ్లు, పులివెందుల-కడప నాలుగులైన్ల రోడ్డు ఇవన్నీ కాంగ్రెస్ పాలనలో జరిగాయన్నారు. వేమన యూనివర్సిటీ, కడప రిమ్స్ ఆసుపత్రి, విమానాశ్రయాభివృద్ధి, తెలుగుగంగ, గాలేరు-నగరి ప్రాజెక్టులో సింహభాగం కాంగ్రెస్ పాలనలో జరిగాయన్నారు. జగన్ పాలనలో పులివెందుల అసాంఘిక శక్తుల అడ్డాగా మారిపోయిందన్నారు. మద్యం ఏరులైపారుతోందన్నారు. జూదం, బెట్టింగ్ విచ్చలవిడిగా సాగుతోందన్నారు. డ్రిప్ ఇరిగేషన్ మూలన పడిందన్నారు. అలాగే ఈనెల 12వ తేదీన ఉదయం 10గంటలకు వేంపల్లె, సాయంత్రం 6గంటలకు పులివెందుల, 13వ తేదీ ఉదయం 10:30గంటలకు ఎర్రగుంట్ల, సాయంత్రం 5గంటలకు జమ్మలమడుగు, రాత్రి 7గంటలకు ప్రొద్దుటూరులలో ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలరెడ్డి పాల్గొంటారని తులసిరెడ్డి తెలిపారు. కాగా.. వేంపల్లెలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద కాంగ్రెస్ పార్టీ కళాజాత నృత్య ప్రదర్శనను తులసిరెడ్డి ప్రారంభించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు, ధ్రువకుమార్‌రెడ్డి, బాబు, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, సుబ్బరాయుడు తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా గాలేరి-నగరి కాల్వ మట్టి తరలింపు

- పట్టించుకోని అధికారులు
- ప్రజాధనం వృథా



పెండ్లిమర్రి, ఏప్రిల్ 10: మండలంలోని వెల్లటూరు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న పెద్దదాసరిపల్లె చెరువు సమీపంలో గాలేరు-నగరి కాల్వ తవ్వి వేసిన మట్టిని అక్రమంగా తరలిస్తున్న అధికారులు ఏమిపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కరువు ప్రాంతమైన రాయలసీమకు తాగు, సాగునీటిని అందించాలనే కృతనిశ్చయంతో కోట్లాది రూపాయలు వెచ్చించి గాలేరు-నగరి కాల్వ పనులను ప్రభుత్వం చేపట్టిందన్నారు. కాల్వ పనులు చేసేటపుడు ఇరువైపుల మట్టిని తవ్వి కట్టగా పోస్తారు. ఈ మట్టిని కొందరు వైసీపీ నేతలు అక్రమ తరలింపు చేస్తున్న అక్రమంగా తరలిస్తూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. గత నెల రోజుల నుంచి రాత్రి 9గంటల నుంచి ఉదయం 5గంటల వరకు టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. టిప్పర్ల ద్వారా మట్టిని తరలించడంతో రోడ్లు పాడై పోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. రోడ్డు వెంబడి ఉన్న తమ పైర్లు దుమ్ము మూలంగా దెబ్బ తింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో మట్టిని తరలించడం వల్ల టిప్పర్ల శబ్దానికి తమకు నిద్రాభంగం కలుగుతోందని చెబుతున్నారు.

మట్టి అక్రమ తరలింపును అడ్డుకోవాల్సిన అధికారులు ఏమిచేయలేని నిస్సహాయస్థితిలో ఉన్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో మట్టి అక్రమమట్టి రవాణ జరుగుతున్న పోలీసులు గాని, రెవిన్యూ అధికారులు గాని పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గాలేరు-నగరి కాల్వకు నిర్మాణ పనులకు సంబంధించిన మట్టిని నిర్భయంగా కొందరు తరలిస్తున్న ఆ శాఖ అధికారులు ఏంచేస్తున్నారో తెలియడం లేదు. దీని మూలంగా చేసిన పనినే మళ్లీ చేయాల్సి ఉంటుంది. లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతుంది. ఇప్పటికైనా జిల్లా ఉన్న తాధికారులు స్పందించిన తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా మంచాలమ్మ గ్రామోత్సవం

నందలూరు, ఏప్రిల్ 10: మండలంలోని ఆడపూరు గ్రామంలో వెలసిన మంచాలమ్మ తల్లి గ్రామోత్సవం బుధవారం అత్యంత ఘనంగా జరిగింది. మంగళవారం రాత్రి గ్రామోత్సవానికి బయలుదేరిన మంచాలమ్మ బుధవారం మధ్యాహ్నానికి ఆలయానికి చేరుకుంది. ఆడపూరు, రాచపల్లి, కొండాయపల్లె, హరిజనవాడ, మర్రిపల్లె గ్రామాల్లో గ్రామోత్సవం కొనసాగింది. ఆలయానికి విచ్చేసిన భక్తులకు మధ్యాహ్నం ఆడపూరు గ్రామానికి చెందిన వెంకటమ్మ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఇంజమ్ రామచంద్రనాయుడు, నందలూరు భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్బారెడ్డి, లక్ష్మయ్య నాయుడు, గ్రావిటీ సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, సురేంద్రరెడ్డి, నవీన్‌రెడ్డి, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

వడ్డెరులు ఐక్యతను చాటుకోవాలి

● యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

సుండుపల్లె, ఏప్రిల్ 10: వడ్డెరలు ఐక్యతను చాటుకోవాలని కలిసికట్టుగా వడ్డెరుల అభివృద్ధికి కృషి చేయాలని వడ్డెర యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం సుండుపల్లె మండలంలోని చెరుకువాండ్లపల్లె, రాచంవాండ్లపల్లెలో గ్రామస్థులతో కలిసి ఆయన మాట్లాడారు. వడ్డెరల ఐక్యత కోసం నిరంతరం పోరాటం చేస్తున్నామని, మేము చేస్తున్న పోరాటానికి వడ్డెరలు మద్దతుగా నివాలన్నారు. వడ్డెరలు రాజకీయ, ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దేరంగుల గురయ్య, జయన్న, రాచయ్య తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేద్దాం

చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యం ● రైల్వేకోడూరులో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు



సంఘీభావం తెలుపుతున్న ముక్కా రూపానందరెడ్డి, కస్తూరి విశ్వనాథనాయుడు, హేమాంబరధరరావు, అరవ శ్రీధర్, తదితరులు

రైల్వేకోడూరు(రూరల్), ఏప్రిల్ 10: అందరం సమష్టిగా పని చేసి చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేయాలని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని తులసీరామ్ కల్యాణ మండపంలో టీడీపీ సీనియర్ నాయకుడు కస్తూరి విశ్వనాథనాయుడు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసిన నాయకులకు, కార్యకర్తలకు అన్ని సందర్భాల్లో అందుబాటులో ఉంటానని ముక్కా రూపానందరెడ్డి హామీ ఇచ్చారు. త్వరలో బూత్ లెవెల్ సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసి ప్రణాళిక ప్రకటిస్తామని తెలిపారు. అన్ని వర్గాలను పక్కనపెట్టి కలసికట్టుగా పోరాడాలని కోరారు. పార్టీ అధిష్టానం మేరకు ఉమ్మడి జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్, రాజంపేట పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ కొరముట్ల హటావో.. కోడూరు బచావో నినాదంతో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో జనసేన గెలిచే మొదటి సీటు రైల్వేకోడూరు అని తెలిపారు. అందరం భేషజాలను పక్కనపెట్టి కలసికట్టుగా పనిచేసి ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు హేమాంబరధరరావు, ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు, బీజేపీ ఇన్‌చార్జ్ గడ్డం చెంగల్‌రాజు, ప్రముఖ న్యాయవాది రెడ్డెయ్య నియోజకవర్గంలోని అన్ని మండలాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈద్గాల్లో బందోబస్తు ఏర్పాట్లు పరిశీలన

రాయచోటిటౌన్, ఏప్రిల్ 10: జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని మాండవ్యనది ఒడ్డున ఉన్న రాయచోటి షాన్ హజరత్ జమాలుల్లా బాషా ఈద్గా, పాతరాయచోటిలోని ఈద్గాల వద్ద గురువారం జరగబోవు ఈద్‌ఉల్ ఫితర్ (రంజాన్ ముగింపు) ప్రార్థనలకు సంబంధించి బందోబస్తు ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, దర్గా కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఖాన్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రార్థనలకు వచ్చే ముస్లింలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు తెలిపారు. ముఖ్యంగా తాగునీటిని అందుబాటులో ఉంచడమే కాకుండా తదితర ఏర్పాట్లపై ఆరా తీశారు. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందడానికి ప్రతిఒక్కరూ గొడుగులు వాడడం మంచిదని సూచించారు. వారి వెంట హెడ్‌కానిస్టేబుల్ రామచంద్రతో పాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, దర్గా కమిటీ సభ్యుడు బేపారి జబీవుల్లా, ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, దర్గా కమిటీ సభ్యులు బేపారి జబీవుల్లాఖాన్, అజ్మత్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



పాతరాయచోటి ఈద్గాలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అర్బన్ సీఐ

ఘనంగా పొంగళ్ల కార్యక్రమం

పెనగలూరు, ఏప్రిల్ 10: మండలంలోని ఈటిమాపురం గ్రామ సమీపాన గుంజనేరు రోడ్డుపక్కనే వెలసిన పట్టపురాయి ఓగూరమ్మ గ్రామ దేవతకు బుధవారం గ్రామ ప్రజలు ఘనంగా పొంగుబాళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఏడూ ఉగాది పర్వదినం నాడు రాత్రి ఓగూరమ్మ ఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవం నిర్వహిస్తారు. మరునాడు గుంజనేరు ఒడ్డున ఉన్న దేవాలయం వద్దకు గ్రామస్తులంతా మహిళలు, చిన్నారులు, పెద్దలు సైతం కొత్త గంపలో సంప్రదాయబద్ధంగా అమ్మవారికి సమర్పించాల్సిన పొంగళ్ల సామగ్రిని పెట్టుకొని ఊరేగింపుగా దేవాలయ సన్నిధికి చేరుకున్నారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో ప్రతి మహిళ పొంగుబాళ్లు పొంగించి ఓగూరమ్మ గుడి ముందు ముద్ద పెట్టుకొని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఉత్సవ విగ్రహానికి కూడా ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని గుర్రప్పస్వామి, గంగాలమ్మ దేవతలకు కూడా ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం కోడి పుంజులు, పొట్టేళ్లు, మేకపోతులను అమ్మవారికి బలిచ్చి శాంతింపచేశారు. ఇదిలా ఉండగా గ్రామానికి చెందిన ఒంటేరు శ్రీనివాసులు అనే కుటుంబ సభ్యులు మధ్యాహ్నం భక్తులకు ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలతో పాటు యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



అమ్మవారికి గంపలో పొంగళ్ల సాంగ్యం తీసుకొస్తున్న దృశ్యం

టీడీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యం



18వ వార్డులో పాల్గొన్న రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 10: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాయచోటి గడ్డపై టీడీపీ జెండాను ఎగురవేయడమే తమ లక్ష్యమని రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన రాయచోటి పట్టణంలోని 18, 19, 20 వార్డుల్లో ఇంటింటా ప్రచారాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆయా వార్డుల్లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాంప్రసాద్‌రెడ్డి ప్రతి ఇంటికి వెళ్లి టీడీపీ అధినేత తీసుకువచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. తమకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పలువురు టీడీపీలో చేరిక

రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీపురంలో పలువురు రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన కండువా కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ అధికారంలోకి వస్తే రాష్ట్ర అభివృద్ధితో పాటు రాయచోటిని కూడా అభివృద్ధి చేసుకోవచ్చని, యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు.

శాంతి భద్రతలకు భంగం కలిగించొద్దు : ఎస్ఐ

గాలివీడు, ఏప్రిల్ 10: శాంతి భద్రతలకు ఎవరూ భంగం కలిగించొద్దని ఎస్ఐ వెంకటప్రసాద్ అన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మండలంలో శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు పోలీసులు మార్చ్ నిర్వహించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు సాగేలా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే నాకాబందీ నిర్వహించిన పోలీసులు పాయింట్లపై నిఘా పెట్టి తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు.



కేంద్ర బలగాలతో పోలీసులు

నల్లారితో వేమన సతీష్ భేటీ

రాజంపేట, ఏప్రిల్ 10: మాజీ సీఎం, రాజంపేట పార్లమెంటు బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డితో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, తానా మాజీ అధ్యక్షుడు వేమన సతీష్ భేటీ అయ్యారు. బుధవారం తిరుపతిలో ఆయనను కలిసి మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛాన్ని అందజేసి విజయానికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలు రాజకీయ అంశాలపై చర్చించారు.



నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డితో వేమన సతీష్

రాష్ట్ర ప్రయోజనాల కోసమే టీడీపీతో పొత్తు

రాజంపేట, ఏప్రిల్ 10: రాష్ట్ర ప్రయోజనాల కోసమే టీడీపీతో బీజేపీ పొత్తు పెట్టుకుందని బీజేపీ జాతీయ కిసాన్‌మోర్చ అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. రాజంపేట బీజేపీ నాయకుడు పోతుగుంట రమేష్ నాయుడు స్వగృహంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా రాష్ట్ర ప్రయోజనాల కోసం బీజేపీ, జనసేన, టీడీపీ పొత్తుపెట్టుకుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి దౌర్జన్య, అవినీతి పరిపాలన అంతమొందించడానికి ఈ పొత్తు చారిత్రక అవసరమన్నారు. జగన్‌ను సాగనంపక పోతే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. వచ్చేది టీడీపీ, జనసేన, బీజేపీ కూటమేనన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోతుగుంట రమేష్‌నాయుడు, మస్తానయ్య, హరిప్రసాద్, శ్రీనివాసులు, పాపయ్య, నగేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రాజు సుడిగాలి పర్యటన



కార్యకర్తలతో మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

సిద్దవటం, ఏప్రిల్ 10: మండలంలోని మాధవరం, భాకరాపేట, కమ్మపాలెం, ఎస్.రాజంపేట, వంతాటిపల్లె తదితర గ్రామాల్లో బుధవారం టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు సుడిగాలి పర్యటన చేశారు. మండలంలోని పలువురు టీడీపీ సీనియర్ నాయకులు స్వగృహాల వద్దకు వెళ్లి వారిని కలిశారు. వారిలో మాజీ ఎంపీటీసీ కాడె శ్రీనివాసులనాయుడు, మాజీ ఎంపీపీ శ్రీరాములు నాయుడు, మాజీ సర్పంచ్ సంజీవరాయుడు, జె.సుబ్బారెడ్డిని కలిసి టీడీపీకి సహకరించాలని కోరారు. కార్యకర్తలు, నాయకులు పార్టీ ఆదేశాలను తప్పక పాటించాలని, ఎన్‌డీఏ కూటమి పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మండల క్లస్టర్ ఇన్‌చార్జి దశరథనాయుడు, పుత్తా రామచంద్రయ్య, టీడీపీ రాజంపేట యువ నాయకులు రాజేష్‌నాయుడు, నాగమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ


రైల్వేకోడూరు(రూరల్), ఏప్రిల్ 10: పట్టణంలోని నిరుపేద ముస్లిం కుటుంబాలకు ముస్లిం యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ చేసినట్లు అధ్యక్షుడు షేక్ అహ్మద్ తెలిపారు. మసూర బియ్యం, గోధుమ పిండి, చక్కర, షేమియాలు, సన్‌ఫ్లవర్ ఆయిల్, జీడిపప్పు, ద్రాక్షా తదితర నిత్యావసర వస్తువులను 65 మంది ముస్లిం కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగ అందరూ ఆనందంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. తమ సంఘం ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మస్తాన్ సాహెబ్, పట్టాన్ మౌలా బాష, కార్యదర్శి మహమ్మద్ అజీమ్ పాల్గొన్నారు.



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న సభ్యులు

వైభవంగా పల్లమ్మ జాతర

పెనగలూరు, ఏప్రిల్ 10: మండలంలోని నర్సింగరాజపురం గ్రామ పంచాయతీ పరిధిలో గల పల్లంపాడు గ్రామంలో బుధవారం సాయంత్రం గ్రామ దేవత పల్లమ్మ జాతర వైభవంగా జరిగింది. ప్రతిఏడు ఉగాది పండుగ మర్నాడు నిర్వహించే జాతర కార్యక్రమం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్విరామంగా సాగింది. మండలంలోని పలు గ్రామాల భక్తులే కాకుండా మండలేతర గ్రామాలు, దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో దేవాలయ ప్రాంగణం కిటకిటలాడింది. దాతల చందాలతో మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భారీగా జంతుబలులు చేశారు. అలాగే గుడి చుట్టూ ట్రాక్టర్లు, బైకులు, పందారపు బండ్లు వేపమండలతో అలంకరణ చేసుకొని ప్రదక్షిణ చేశాయి. ధర్మకర్త మండలి భక్తులకు తాగునీరు, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా మంగళవారం రాత్రి యారాచపల్లె, నర్సింగరాజపురం హరిజనవాడ గ్రామాల్లో పల్లమ్మ తల్లి, పోతుల రాజు ఉత్సవ మూర్తులతో తెల్లవారే వరకు కన్నుల పండువగా గ్రామోత్సవం జరిగింది.



భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారి మూలవిరాట్

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన నోడల్ అధికారి

సిద్దవటం, ఏప్రిల్ 10: మండల కేంద్రమైన సిద్దవటం, దిగువపేటలోని మెయిన్ పాఠశాలల్లో జరిగిన టోఫెల్ (టెస్ట్ ఆఫ్ ఇంగ్లీష్ ఆజ్ ఏ ఫారిన్ లాంగ్వేజ్) పరీక్షలను బుధవారం జిల్లా నోడల్ అధికారి ప్రసాద్‌రెడ్డిలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఇంగ్లీష్ బాషా ప్రావీణ్యాన్ని పరీక్షించడానికి ప్రతిష్టాత్మకమైన టోఫెల్ పరీక్షను ఈటీఎఫ్ అనుసంధానంతో ఈ నెల 10, 12వ తేదీల్లో నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని 121 పాఠశాలల్లో ఈ టోఫెల్ ప్రైమరీ పేరుతో పరీక్షను బుధవారం 3, 4, 5 తరగతుల విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



పరీక్ష కేంద్రంలో ప్రశ్నాపత్రాలు పరిశీలిస్తున్న దృశ్యం

టీడీపీ అభ్యర్థిని గెలిపించండి: సుగవాసి

నందలూరు,ఏప్రిల్ 10: రాజంపేట టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు కోరారు. బుధవారం ఆయన మండలంలోని ఆడపూరు, టి.వి.రాచపల్లె, కోనాపురం, హరిజనవాడ, నూకినేనిపల్లె, కుంపిణీపురం, మిద్దెల గ్రామాల్లో గ్రామ నాయకులను కలిసి వారి మద్దతు కోరారు. ఈ కార్యక్రమంలో రాజంపేట వ్యవసాయ మార్కెట్ మాజీ అధ్యక్షుడు ఎద్దుల విజయసాగర్, టీడీపీ నాయకులు రాముయాదవ్, జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ప్రసాద్‌బాబు

నేడే బలిజపల్లె గంగమ్మ జాతర

● ఏర్పాట్లు పూర్తి ● భారీ బందోబస్తు



బందోబస్తు ఏర్పాట్లు పరిశీలిస్తున్న పట్టణ సీఐ మద్దయ్య ఆచారి

రాజంపేటటౌన్, ఏప్రిల్ 10: రాజంపేట బలిజపల్లె గంగమ్మ జాతర గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం ఏర్పాట్లు పూర్తి చేశారు. తెల్లవారు జాము నుంచి ఈ వేడుకలు జరగనున్నాయి. ఈ సందర్భంగా బలిజపల్లె గంగమ్మ జాతర ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు గంగమ్మ జాతర ఏర్పాట్లను ముమ్మరంగా చేస్తున్నారు. వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో భాగంగా రాజంపేట పట్టణ సీఐ మద్దయ్య ఆచారి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు - నగదు స్వాధీనం

సిద్దవటం, ఏప్రిల్ 10: మండలంలోని భాకరాపేట హెచ్‌పీసీఎల్ సమీపంలో బుధవారం పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి రూ.10,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పెద్దఓబన్న తెలిపారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


రైతు బాగు కోసం ... యువత భవిష్యత్ కోసం... ప్రజల బంగారు భవిత కోసం ... వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధి కోసం...
ఉద్యోగ, ఉపాధి కోసం ... నిరుద్యోగ నిర్మూల కోసం... కర్షక, కార్మిక, శ్రామిక సంక్షేమం కోసం... రైతు బాగు కోసం ... యువత భవిష్యత్ కోసం... ప్రజల బంగారు భవిత కోసం ... వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధి కోసం...
ప్రజల కోసం
ప్రజా సేవకోసం
తంబళ్లపల్లె
నియోజకవర్గం
పెద్దమండ్యం
తంబళ్లపల్లె
ములకలచెరువు
పి.టి.యం
బి. కొత్తకోట
కురబలకోట
యువత కోసం...
యువత భవిష్యత్ కోసం ...
పారిశ్రామికుడినవుతా
రైతు కోసం...
రైతు ఆనందం కోసం ...
కర్షకుడినవుతా
పరిశ్రమలు తీసుకువచ్చి
యువత భవితకు ...
బాటలు వేస్తా
రైతు పండించిన పంటకు
గిట్టుబాటు ధర తెప్పించి
అన్నదాత కళ్లలో
ఆనందాన్నవుతా...!!
ఎందరో మహానుభావులు ...
అందరికీ వందనాలు
ఎవరో వస్తారని... ఏదో చేస్తారని...
ఇప్పటి వరకు ఎదురుచూశాం
పుంగనూరు, బెంగుళూరు
రాజకీయాలతో విసిగిపోయాం
ఎదురు చూసింది చాలు ...
మోసపోయిందీ చాలు!
మన తంబళ్లపల్లె అభివృద్ధి కోసం
ఎవరు వచ్చినా.. రాకపోయినా
నేను ముందుంటా
మీ కష్టంలో తోడవుతా
అభివృద్ధిలో భాగమవుతా
మీ వెంటే నేనుంటా
"ఏ దేశమేగినా.. ఎందు కాలిడినా...
పొగడరా నీ తల్లి భూమి భారతిని"
అన్న ఓ మహనీయుని
మాటల స్ఫూర్తితో ...
పుట్టిన నేల రుణం తీర్చుకునేందుకు
మీ సేవకుడు
కొండా నరేంద్ర
KONDA NARENDRA, M.S. (USA)
పారిశ్రామిక వేత్త, సామాజిక వేత్త, మానవతా వాది
తంబళ్లపల్లె నియోజకవర్గం
ఉద్యోగ, ఉపాధి కోసం ... నిరుద్యోగ నిర్మూల కోసం... కర్షక, కార్మిక, శ్రామిక సంక్షేమం కోసం...
రైతు బాగు కోసం ... యువత భవిష్యత్ కోసం... ప్రజల బంగారు భవిత కోసం ... వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధి కోసం... ఉద్యోగ, ఉపాధి కోసం ... నిరుద్యోగ నిర్మూల కోసం... కర్షక, కార్మిక, శ్రామిక సంక్షేమం కోసం...

రంజాన్‌కు ఈద్గాలు ముస్తాబు

వాల్మీకిపురం, ఏప్రిల్ 10: వాల్మీకిపురం మండల వ్యాప్తంగా రంజాన్ పండుగకు ఈద్గాలు సుందరంగా ముస్తాబు చేశారు. ఉపవాసదీక్షల అనంతరం గురువారం రంజాన్ వేడుకలను జరుపుకోనున్నారు. మసీదులకు విద్యుద్దీపాలంకరణలు, ఈద్గాల శుద్ధి కార్యక్రమాలు పూర్తి చేశారు.

ముస్లింలకు శుభాకాంక్షలు


మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 10: రంజాన్ సందర్భంగా మదనపల్లెకు చెందిన టీడీపీ మైనార్టీ నాయకుడు పఠాన్‌ఖాదర్‌ఖాన్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆయన కోరారు. నియమాలతో కూడిన ఉపవాస దీక్షలే రంజాన్ మాసం ప్రత్యేకత అని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కే బాషా తెలిపారు ఈద్ ముబారక్ తెలియజేశారు.

కాంగ్రెస్‌తోనే లౌకిక రాజ్యం

రామసముద్రం, ఏప్రిల్ 10: లౌకికవాదం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పుంగనూరు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మురళీమోహన్‌యాదవ్ తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా తన సొంత గ్రామమైన రామసముద్రం మండలంలోని బలసముద్రం గ్రామంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు బీసీలు, ముస్లిం, ఎస్టీ, ఎస్సీ, వర్గాలతోపాటు, సీపీఐ, సీపీఎం పార్టీల నుంచి తనకు మద్దతు ఉందని, పుంగనూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

20 మంది గర్భిణిలకు వైద్య పరీక్షలు

కలకడ, ఏప్రిల్ 10: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం 20 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఎర్రకోటపల్లి పీహెచ్‌సీ డాక్టర్ జవహర్‌బాబు తెలిపారు. వీరిలో 5 మందిని మెరుగైన వైద్య పరీక్షల నిమిత్తం ఉన్నత స్థాయి ఆసుపత్రికి సిఫారసు చేశామన్నారు. రక్తహీనత వున్నవారిని గుర్తించి ఐరన్ సూక్రోజ్ ఇంజక్షన్లు వేశామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది జయరామయ్య, భారతమ్మ, సుబ్బరత్నమ్మ, వేంకటేశ్వరరావు, రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలైంది

● నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, ఏప్రిల్ 10: వైసీపీ ప్రభుత్వ పనితీరుపై విసిగిపోయిన ప్రజల్లో తిరుగుబాటు మొదలయ్యిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి అన్నారు. ఎన్నికల షెడ్యూలు మొదలయిన తరువాత పెద్ద ఎత్తున ప్రభుత్వంపై తిరస్కార ధోరణి మొదలైందని దాని కారణంగానే గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరుతున్నారని ఆయన వివరించారు. మండలంలోని పారపట్ల పంచాయతీలో పలువురు నాయకులు బుధవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కిశోర్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ కొత్త చేరే వారందరికీ కూడా పార్టీలో సముచిత స్థానముంటుందని హామీ ఇచ్చారు. కిరాతకమైన రాక్షస ప్రభుత్వం నుంచి రాష్ట్రాన్ని రక్షించడమే ధ్యేయంగా పనిచేయాలని కోరారు. పారపట్లకు చెందిన వైసీపీ నాయకుడు వై.వెంకటరమణా రెడ్డితోపాటు టీడీపీలో చేరిన వారిలో సి.దామోదర్ రెడ్డి, సి.వెంకటరమణా రెడ్డి, మాజీ సైనికుడు కె.ఎల్లారెడ్డి, సి.భాస్కర్ రెడ్డి, సి.యల్లయ్య, జి.యోగేష్, జి.శ్రీహరి, కె.శివ, ఎ.మణికుమార్, ఎ.రాజేష్, వెంకటరమణ, జి.మహేష్‌కుమార్, ఎం.చంద్రశేఖర్, ఎన్.నరసింహా రెడ్డి తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో కలికిరి సర్పంచు ప్రతాప్‌కుమార్ రెడ్డి, సురేష్‌కుమార్ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, హరినాథ రెడ్డి, రామకొండా రెడ్డి, సతీష్ రెడ్డి, జ్ఞానమూర్తి, శీను, వేణు తదితరులు పాల్గొన్నారు.


పారపట్లలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు

దొడ్డిపల్లె గ్రామస్తుల చేరిక

కలకడ మండలం దొడ్డిపల్లె పంచాయతీకి చెందిన పలువురు నాయకులు బుధవారం టీడీపీలో చేరారు. నగరిపల్లెలోని కిశోర్‌కుమార్ రెడ్డి నివాసం వద్ద వీరంతా పసుపు కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు. కొత్తగా పార్టీలో చేరిన వారిని కిశోర్‌కుమార్ రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కె.దొడ్డిపల్లెకు చెందిన సి.జనార్ధన నాయుడు, బీఈడీ రమణ, కొండయ్య నాయుడు, రామాంజులు నాయుడుజౌ, వినోద్ రాయల్, శ్రీనివాసులు నాయుడు, రమణయ్య, రాధాకృష్ణ, సరసపల్లి శ్రీనివాసులు నాయుడు తదితరులున్నారు. కేవీ పల్లె మండల టీడీపీ నాయకుడు మాజీ ఆయిల్ సీడ్స్ ఛైర్మన్ తిమ్మాపురం రఘునాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దొడ్డిపల్లె గ్రామస్తులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కిశోర్‌కుమార్ రెడ్డి

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ఒక ప్రకటన చేశారు.ఉపవాస దీక్షలను విరమిస్తున్న సందర్భంగా వారి ఆయురారోగ్యాలు వృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్ర పురోభివృద్ధికి, యువత ఉజ్వల భవిషత్తు కోసం అందరం కలిసికట్టుగా పునరంకితం కావలసి వుందన్నారు. దశాబ్దాల కాలంగా ముస్లింలకు అన్ని విధాల అండగా నిలబడుతూ వారి ఆకాంక్షలకు అనుగుణంగా చేయూతనిస్తున్న తమ కుటుంబం ముందుముందు మరిన్ని సేవలను అందజేసేందుకు అవకాశమివ్వాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అదే విధంగా మైనారిటీల భవిషత్తు కోసం తాము రాజకీయాలకు అతీతంగా కృషి చేస్తామన్నారు.

ఎన్నికల ప్రశాంత నిర్వహణకు సహకరించాలి

పీలేరు, ఏప్రిల్ 10: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని జేసీ ఫర్మాన్ అహ్మద్ పీలేరు నియోజకవర్గంలోని రాజకీయ పార్టీలకు సూచించారు. ఎన్నికల ఏర్పాట్లపై బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. ఎన్నికల నిబంధనలు కఠినంగా అమలు చేస్తున్నామని, ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి నియోజకవర్గంలో 5 కేసులు నమోదు చేసి రూ.23.79 లక్షల నగదు జప్తు చేశామన్నారు. ఎన్నికల నియామవళి అతిక్రమించిన 6 మంది కాంట్రాక్టు ఉద్యోగులు, 8 మంది వలంటీర్లను విధుల నుంచి తొలగించామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 122 మంది వలంటీర్లు తమ విధులకు రాజీనామా సమర్పించారని వెల్లడించారు. ఇప్పటి వరకు వివిధ రాజకీయ పార్టీల ప్రచార సభలు, వాహనాలకు 163 అనుమతులు మంజూరు చేశామన్నారు. సీ-విజిల్ యాప్ ద్వారా అందిన 8 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. ఇంటింటి ప్రచారానికి రాజకీయ పార్టీలు ముందస్తు అనుమతి తీసుకోవాలని, కరపత్రాలు పంచడానికి కూడా ముందస్తు అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలను అందరూ విధిగా పాటించాలని, అలా పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు మహబూబ్ బాషా, ఖతీజున్ ఖుద్రా, ప్రదీప్, డీటీలు సుబ్రహ్మణ్యం, విజయ్, ఆర్ఐ చాణక్య తదితరులు పాల్గొన్నారు.


పాత్రికేయులతో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్

ముస్లింలపై వైసీపీ గిమ్మిక్కులు : షాజహాన్ బాషా

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 10: రాష్ట్రంలో ముస్లిం ఓటర్లను తప్పుదోవ పట్టించేందుకు వైసీపీ గిమ్మిక్కులు చేస్తోందని మదనపల్లె టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా ధ్వజమెత్తారు. బుధవారం సుభాష్‌రోడ్డులోని ఆయన నివాసం వద్ద విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ కూటమి అధికారంలోకి వస్తే ముస్లింలకు రిజర్వేషన్ తీసేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఒక ప్రెస్ మీట్‌లో చెప్పినట్లు మార్ఫింగ్ వీడియో రిలీజ్ చేసి వైసీపీ నాయకులు వక్రబుద్ధి చూపుతున్నారన్నారు. . ఐదేళ్ల వైసీపీ పాలనలో ముస్లింలకు ఏంన్యాయం చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.. టీడీపీ ముస్లీం మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎం రఫి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఏ మస్తాన్ జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు, దారం అనిత, రాటకొండ మధుబాబు, సుద్దిళ్ల సుధాకర్, కత్తి లక్ష్మన్న, విజయ్‌కుమార్, నాగూర్‌వలి, షంషీర్, ఈశ్వరనాయుడు, మధు, పాల్గొన్నారు.అనంతరం ఆత్మహత్య చేసుకున్న చెందిన చేనేతకార్మికుడు మల్లికార్జున కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. తమ ప్రభుత్వం వస్తూనే ఇంటి స్థలం ఇప్పించి, ఇల్లు కట్టిస్తామన్నారు

రామసముద్రం: మండలంలోని నడింపల్లె పంచాయతీ ఆర్.కమతంపల్లె, జంగాలపల్లె గ్రామాల్లో షాజహాన్ బాషా పర్యటించారు.

జగన్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి

● చంద్రబాబుతోనే బీసీల సంక్షేమం ● టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి

మొలకలచెరువు, ఏప్రిల్ 10: బీసీలంతా ఏకమై జగన్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని తంబళ్ళపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పిలుపు నిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం జయహో బీసీ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అవినీతి, అరాచక ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతోనే బీసీల సంక్షేమం సాధ్యమన్నారు. బీసీలకు అన్ని రంగాల్లో అధిక ప్రాధాన్యత ఇచ్చిన పార్టీ టీడీపీయేనన్నారు. తంబళ్ళపల్లె నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీ కేంద్రాల్లో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్య దర్శి పర్వీన్‌తాజ్, బీసీసెల్ పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, కార్యనిర్వాహక కార్యదర్శి ముత్తుకూరు మౌలా, మండల టీడీపీఅధ్యక్షుడు పాలగిరి సిద్ధా, ఆనందరెడ్డి, నారాయణ స్వామిరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, వైజీ సురేంద్ర యాదవ్, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, , రాష్ట్ర సాధికార సమితి సభ్యుడు కేశవులు, నియోజకవర్గ అధ్యక్షుడు చెన్నకిష్టా, నాయకులు కేవీ రమణ, శివన్న, ప్రతాప్, ప్రతాప్‌నాయుడు, శివ, గాండ్ల రెడ్డెప్ప పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

పెద్దతిప్పసముద్రం: జనసేన తంబళ్లపల్లె ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్ ఆధ్వర్యంలో మండలంలోని మద్దయ్యగారిపల్లెలో జయచంద్రా రెడ్డి పర్యటించారు. ముందుగా గ్రామ శివారులోని శూలల గంగమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రజలకు మంచి జరగాలని, తనకు నియోజకవర్గంలో విజయాన్ని చేకూర్చి పెట్టాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం సూపర్ సిక్స్, బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు తంబళ్లపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనకు ఒక్క అవకాశం కల్పించాలని, సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని, మన రాజంపేట పార్లమెంట్ పరిధిలో నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి కమలం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఓడిస్తాం : బలిజ సంఘం

మదనపల్లె, ఏప్రిల్ 10: జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను ఓడి స్తామన్న రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డి వ్యాఖ్యలపై బలిజ సంఘం నేతలు మండిపడ్డారు. పవన్ కల్యాణ్‌తోపాటు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ను కుప్పంలో, మంగళగిరిలో టీడీపీ యువనేత నారా లోకేష్‌ను ఓడించాలని వైసీపీ అధినేత, సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రకటనతో పిఠాపురంలో పవన్‌కల్యాణ్‌ను ఈ ఎన్నికల్లో ఓడించడానికి జిల్లా నుంచి వైసీపీ నేతలను పంపించారని తెలిపారు. స్థానిక బర్మావీధిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులు అధ్యక్షతన బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న ఆదివారం స్థానిక సీఎస్ఐ కమ్యూనిటీ హాలులో ఉదయం 10 గంటలకు బలిజ, కాపుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. జనసేన రాష్ట్ర పీఏసీ సభ్యురాలు దారం అనిత మాట్లాడుతూ పిఠాపురంలో పవన్‌కల్యాణ్‌ను ఓడిస్తామన్న పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఓడించడానికి బలిజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బలిజ సంఘం నేతలు కె.అంజనేయకుమార్, దారం హరిప్రసాద్, పసుపులేటి మోహన్‌బాబు, తులసీ శ్రీనివాసులు, వి.లీలాకుమార్, మహర్షి భాస్కర్, బోర్‌వెల్ నాగరాజ, పి.వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

పీలేరు కోర్టు నూతన భవనాల మంజూరుకు కృషి

పీలేరు, ఏప్రిల్ 10: పీలేరులోని కోర్టులకు నూతన భవనాల మం జూరుకు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు నల్లారి ద్వారకనాథరెడ్డి తెలి పారు. పీలేరు కోర్టులను బుధ వారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పీలేరు కోర్టులకు ఇప్ప టికే నూతన భవనాలు మంజూరు కావాల్సి ఉన్నా సాంకేతిక కారణాల వల్ల ఆలస్యం జరిగిందన్నారు. హైకోర్టు ఉన్నతాధికారులతో మాట్లాడి వాటి మంజూరుకు కృషి చేస్తానన్నారు.అనంతరం పీలేరు బార్ కౌన్సిల్ సభ్యులు ద్వారకనాథరెడ్డిని ఘనంగా సన్మానించారు. బార్ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు రఫీ అన్సారీ, న్యాయవాదులు భవానీ శంకర, నిరంజన్, దొరస్వామి నాయుడు, తెనాలి రామ సుబ్రహ్మణ్యం, జగన్, ఎల్లయ్య, సుధాకర్ రెడ్డి, వెంకటముని, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి ఉగాది ఉత్సవాలు

మదనపల్లె అర్బన్ ఏప్రిల్ 10: స్థానిక నీరుగట్టు వారిపల్లెలో మంగళవారం రాత్రి చౌడేశ్వరి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నీరుగట్టువారి పల్లెలోని మాయా బజార్, చౌడేశ్వరీదేవినగర్, రాజానగర్, రామి రెడ్డిలేఔట్, మునెప్ప కాలనీ, కనక దాస్‌నగర్ ప్రాం తాల్లో అమ్మవారిని పుష్పపల్లకిలో ఊరేగించారు మద నపల్లె టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా తోపాటు తెలు గు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు, ఆర్‌జే వెంకటేష్, నాగూర్‌వలి, దొరస్వామినాయుడు, జేసీబీ మధు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయకమిటీ సభ్యులు షాజహాన్‌బాషాను సన్మానిం చారు. బుధవారం పగలు తిరుణాల వైభవంగా నిర్వహించారు. సాయం త్రం ఉట్లోత్సవానికి ఏర్పాట్లు చేశారు. ఉట్లమాను ఎక్కడానికి యువత పోటీ పడ్డారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు, మదనపల్లె తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షుడు ఉప్పురామచంద్ర, కార్యదర్శి గుండ్లపల్లె ప్రభాకర్, ట్రెజరర్ రామిశెట్టిలోకేష్, మోడెం సిద్దప్ప, కమలమరికృష్ణ, మోడెం రాజు, ప్రెస్ వెం కటేష్, బండినాగరాజ, రామిశెట్టి నీలకంఠ, డాక్టర్ నార్నవరం వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కలకడ: మండలంలోని కోన చౌడేశ్వరీదేవి ఉత్సవా లను బుధవారం తొగటవీర క్షత్రియ సంఘం ఆధ్వ ర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి బోనాలు సమర్పించారు. కోనతో పాటు సమీప గ్రామల ప్రజలు అధిక సంఖ్యలో హజరై మొక్కులు తీర్చుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా బావిలో గంగమ్మ జాతర

బి కొత్తకోట, ఏప్రిల్ 10: మండల కేంద్రంలో బుధవారం బావిలో గంగమ్మ జాతర నిర్వహించారు. ఈ సంద్భంగా గంగాభవాని అమ్మవారికి పూజలు చేశారు. వాయల్పాడుకు చెందిన సత్యనారాయణ శాస్త్రి, విశ్వనాథశాస్త్రి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పందర్భంగా ఏర్పాటు చేసిననాదస్వరం, భజనలు, దీపారాధనలు చాందినీబండ్లు ఆకట్టుకున్నాయి.

కర్ణాటక మద్యం పట్టివేత

తంబళ్లపల్లె, ఏప్రిల్ 10: కర్ణాటక మద్యం కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు న మోదు చేసినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. .తంబళ్లపల్లె మండలం ఆర్ఎన్ తాండా సమీపంలో కర్ణాటక మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావటంతో ఎస్ ఈబీ ఎస్ఐ వెంకటేష్, తమ సిబ్బందితో కలసి దాడులు చేశారు. ఎద్దుల వేమన్నగారిపల్లెకు చెందిన గోవింద్ వద్ద 180ఎంఎల్ 336 కర్నాటక టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, అతనిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. నిందితుడిని రిమాండుకు పంపినట్లు ఎస్ఐ తెలిపారు. సిబ్బంది గోపాలకృష్ణ, రాఘవేంద్ర, కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

100లీటర్ల నాటుసారా సీజ్.. ఒకరి అరెస్ట్

వాల్మీకిపురం, ఏప్రిల్ 10: వాల్మీకిపురం మండలంలో 100 లీటర్ల నాటుసారాను పోలీసులు స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు. సీఐ పులి శేఖర్ కథనం మేరకు మండలంలోని చింతపర్తి గ్రామ పంచాయతీ మేకలవారిపల్లెకు చెందిన కె.నాగరాజు(47) సారా అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి 100లీటర్లు నాటు సారా స్వాధీనం చేసుకుని, అతనిని అరెస్టు చేశారు. నిందితుణ్ణి రిమాండు నిమిత్తం కోర్టుకు హాజరుపరిచారు. ఎస్ఐ నాగేశ్వర్‌రావ్ పాల్గొన్నారు.

కొత్తపల్లె సమీపంలో యాచకురాలు మృతి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 10: మండలంలోని కొత్తపల్లె సమీప పొల్లాలో గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. కొత్తవారిపల్లె, ఈశ్వరమ్మ ఇండ్లు, ప్రాంతాల్లో యాచిస్తూ జీవనం గడుపుతున్న మహిళగా పోలీసులు గుర్తించారు. ఆమె చని పోయి నాలుగైదు రోజులు గడిచినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహం కుళ్లి పోయి గుర్తు పట్టలేని స్థితిలో కనపించింది. దీంతో అక్కడే పంచనామా నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ శేఖర్ తెలిపారు.

హార్సిలీ హిల్స్‌లో సమాచార హక్కు కమిషనర్

బి కొత్తకోట, ఏప్రిల్10: బి కొత్తకోట మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్‌లో రాష్ట్ర సమాచారహక్కు చట్టం కమీషనర్ కాకర్ల చెన్నారెడ్డి పర్యటించారు. బుధవారం కుటుంబ సమేతంగా విడిది చేశారు. గాలి బండ, వ్యూపాయింట్, గంగోత్రి తదితర ప్రాంతాలను తిలకించారు. అధికారుఉ ప్రొటోకాల్ నిబంధనల మేరకు ఏర్పాట్లు చేశారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

తంబళ్లపల్లె, ఏప్రిల్ 10: రాష్ట్ర సమగ్రాభివృద్ధి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే సాధ్యమవుతుందని తంబళ్లపల్లె టీడీపీ నాయకులు అన్నారు. బుధవారం మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి ఆధ్వర్యంలో గంగిరెడ్డిపల్లె కేబీ తాండా పంచాయతీలలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.డేరంగుల చంద్ర, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రం: నారేవారిపల్లె, తప్పసానిపల్లెలో మదనపల్లె నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముసిలికుంట నాగయ్య ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు.రజక సాధికార కమిటీ సభ్యులు రామ్మూర్తి, సి.గోపాల్, బీసీ నాయకులు చందు, పెద్ద అమరప్ప, చిన్న అమరప్ప, చెన్ను, నాగరాజు, హరి, అధిక సంఖ్యలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేస్తాం

తంబళ్లపల్లె, ఏప్రిల్ 10: నియోజకవర్గంలోని గోపిదిన్నెలో బుధవారం గ్రామ టీడీపీ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామాధ్యక్షుడిగా ఎన్.రమణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఆర్.వెంకటరెడ్డిని ఎన్నుకున్నారు. జగదీష్, వీరాంజనేయులు, హరి, భాస్కర, వెంకట్రమణ, అశోక్, రమణ, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

అధిష్టానం నిర్ణయాన్ని గౌరవిద్దాం:శంకర్‌యాదవ్

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 10 : తెలుగుదేశం పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయాలను గౌరవిద్దామని తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన నవాబుకోట పంచాయతీ తాడిగవాండ్లపల్లెలో గంగమ్మ జాతరకు హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ జెండాను ఎగురవేసేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్దంగా ఉన్నారన్నారు. ఎన్నికలలోపు ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసి కార్యకర్తలు తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానన్నారు.కార్యక్రమంలో మొలకలచెరువు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, తంబళ్లపల్లె నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ సభ్యుడు కుడుం శ్రీనివాసులు, రాష్ట్ర ఎస్సీ కార్యదర్శి తమక శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.